సాక్షి కామారెడ్డి

సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



ఆధునికీకరణలో జాప్యం

నిధులు లేక నిజాంసాగర్ ప్రాజెక్టు జలవిద్యుదుత్పత్తి కేంద్రం ఆధునికీకరణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.

- 8లో ▸



బోనస్ ఇవ్వాలి

దొడ్డు వడ్లకు సైతం క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు రాస్తారోకో చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
39.0 /19.1

వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత ప్రారంభమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

27న ఆర్యసమాజం స్వర్ణోత్సవ యాగం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్య సమాజం 50వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 27న స్థానిక శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూల్ ఆవరణలో 108 యజ్ఞకుండాలతో గాయత్రి మహాయాగం నిర్వహించనున్నారు. ఈ విషయాని ఆర్యసమాజం అధ్యక్షుడు కిషన్, కార్యదర్శి అరుణ, ప్రతినిధులు సత్యమిత్ర ఆర్య, రమేష్ తెలిపారు. స్వర్ణోత్సవాలలో ముఖ్యవక్తగా కోల్‌కతాకు చెందిన మహేంద్రపాల్ ఆర్య పాల్గొంటారని పేర్కొన్నారు. ఉత్సవాలలో ప్రజలు పాల్గొనాలని కోరారు.

టీచర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి



కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ఇష్టారాజ్యంగా పుట్టుకొస్తున్న ప్రయివేట్ బడుల అనుమతులను నియంత్రించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సమాఖ్య జిల్లా చైర్మన్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం జిల్లాకేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. డీఎస్సీ –2008 ఉపాధ్యాయుల వేతనాలతోపాటు పెన్షనర్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమాఖ ప్రతినిధులు దేవులా, రాజ్‌కుమార్, హన్మంతురెడ్డి, గఫూర్ శిక్షక్, ముజీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : జొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ హన్మంత్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్నలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 3,371 మద్దతు ధర ఇస్తోందని తెలిపారు. రైతులు దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు నాగిరెడ్డి, దస్తారెడ్డి, హనుమయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు సంజీవ్, బసవరాజ్, దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నిలిచిన నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా విడుదలవుతున్న నీటిని ఆదివారం ప్రాజెక్ట్ అధికారులు నిలిపివేశారు. యాసంగి సీజన్ కోసం విడుదలవుతున్న నీటిని ఈ నెల 9వ తేదీనే నిలిపివేయాల్సి ఉంది. కానీ, కాకతీయ కాలువ జోన్-2 ఆయకట్టు కోసం ప్రాజెక్ట్ అధికారులు మూడు రోజులపాటు నీటి విడుదలను కొనసాగించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ నుంచి అన్ని కాలువలు, లిఫ్టులకు నీటి విడుదల నిలిచిపోగా, ఆదివారం నాటికి ప్రాజెక్ట్‌లో 11.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిలిచిన విద్యుదుత్పత్తి

కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల నిలిపివేయడంతో జల విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. మళ్లీ వచ్చే ఖరీఫ్ సీజన్‌లో కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టే వరకు విద్యుదుత్పత్తి జరిగే అవకాశం ఉండదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 3.44 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగినట్లు జెన్‌కో అధికారులు వెల్లడించారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను నిజామాబాద్ సీపీ పోతరాజు సాయిచైతన్య ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని సీపీ క్యాంప్ ఆఫీసులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడారు. అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సూపరింటెండెంట్ నవాజ్‌ఖాన్, ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

- పదిహేను రోజుల క్రితం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ చౌరస్తా వద్ద ఆగి ఉన్న కారుపై నలుగురు దాడి చేసి అదిలాబాద్‌కు చెందిన వారి నుంచి బ్యాగ్, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లారు. నిందితులను పార్థి గ్యాంగ్‌కు చెందినవారిగా గుర్తించారు.
- నెలన్నర క్రితం బిచ్కుంద మండలంలో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తూ పొలం వద్ద పనులు చేసుకుంటున్న మహిళా రైతు వద్ద ఆగారు. తాగడానికి నీళ్లు కావాలని అడుగుతూ ఆమెపై దాడిచేసి మెడలోనుంచి బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. ఇప్పటికీ నిందితులెవరో తెలియలేదు. నిందితులు మహారాష్ట్రకు చెందిన వారుగా అనుమానిస్తున్నారు.
- నిజామాబాద్ రూరల్ పరిధిలోని కొత్తపేట అటవీ ప్రాంతంలో మూడువారాల క్రితం దారి దోపిడీ జరిగింది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై ఇద్దరు దుండగులు దాడి చేసి నగదు, సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. పోలీసులకు అనుమానం వచ్చి సమీపంలోని రైస్ మిల్లు లో తనిఖీలు చేశారు. అక్కడ పనిచేస్తున్న ఇతర రాష్ట్రానికి చెందిన వారే నిందితులని తేలింది.

సరికొత్త సవాల్!

జిల్లాలో పెరుగుతున్న అపరిచితులు

- ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో రాక
- ముసుగులతో దోపిడీలు, చోరీలకు పాల్పడుతున్న పలువురు
- కొత్త నేరస్తులను గుర్తించడంలో అనేక అడ్డంకులు
- పోలీసులకు సవాల్‌గా మారుతున్న కేసుల ఛేదన

- కొన్నాళ్ల క్రితం భిక్కనూరు మండలం బస్వాపూర్‌లో మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా దుండగులు ఆమెపై దాడి చేసి బ్యాగు లాక్కుని పారిపోయారు. విచారణలో అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. చివరికి నిందితులను ఇతర రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు.
- డిసెంబర్‌లో కామారెడ్డి అశోక్‌నగర్‌లోని కిరాణా దుకాణానికి ఓ వ్యక్తి వచ్చి.. షాప్ నిర్వాహకురాలైన వృద్ధురాలి మెడలోంచి చైన్ లాక్కుని పరారయ్యాడు. పోలీసులు కేసు ఛేదనకు తీవ్రంగా శ్రమించి, నిందితులను ఇతర రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు.



కామారెడ్డి క్రైం : గతంలో ఎక్కడైనా దొంగతనం గానీ, దోపిడీ గానీ జరిగితే.. నేరం జరిగిన తీరు, లభించిన ఆధారాలను బట్టి ఎవరు చేసి ఉంటారనే దానిపై పోలీసులు సులువుగా ఒక అంచనాకు వచ్చేవారు. పాత నేరస్తులపై నిఘా ఉంచడం ద్వారా నేరాలను అదుపు చేసేందుకు చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. కొత్తకొత్త నేరస్తులు పుట్టుకు వస్తున్నారు. ఆనవాళ్లు దొరక్కుండా నేరాలు చేయడంలో కొత్తపుంతలు తొక్కుతున్నారు. జిల్లాలో ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్తుల కదలికలు ఎక్కువయ్యాయని తెలుస్తోంది. వారు నేరం చేసి పారిపోతుండడంతో కేసును ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.

ఇతర రాష్ట్రాల నుంచి వస్తూ..

కామారెడ్డి జిల్లా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దును కలిగి ఉంది. జిల్లా కేంద్రం మీదుగా 44 వ నంబర్ జాతీయ రహదారి, పట్టణం మధ్యలో నుండి ప్రధాన రైల్వే లైన్ ఉన్నాయి. రాత్రి వేళల్లో చోరీలు, దోపిడీలకు పాల్పడి రైల్వే, హైవే లగుండా తేలికగా తప్పించుకునే అవకాశాలు ఉండడంతో దొంగలు కామారెడ్డి, చుట్టుపక్కల ప్రాంతాలను ఎంచుకుంటున్నట్లు తెలుస్తుంది. అభివృద్ధి పరంగా ఎప్పుడైనా ముందంజలో ఉంటే కామారెడ్డికి దొంగల బెడద చాలా కాలంగా ఉన్నదే. మహారాష్ట్ర, కర్ణాటకలోని బీదర్ ముఠాలు సంచరిస్తూ తాళం వేసిన ఇళ్లు, వాహనాలను దోచుకువెళ్లడం తరచుగా జరుగుతుంది. జిల్లాగా ఏర్పడిన తర్వాత కూలీల కొరత పెరగడంతో బీహార్, యూపీ, హర్యానా, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి కూలి పనుల కోసం చాలామంది ఇక్కడకు వలస వస్తున్నారు. వారిలో కొందరు చోరీ కేసుల్లో పట్టుబడిన ఘటనలు సైతం ఉన్నాయి. ఇలాంటి వారు మధ్యాహ్నం వేళలో రెక్కీ నిర్వహిస్తూ అర్ధరాత్రి దాటాక తాళం వేసిన ఇళ్లను, వాహనాలను టార్గెట్ చేస్తున్నారు. నిజామాబాద్ శివారులో ఇటీవల జరిగిన దారి దోపిడీ కేసు ఇలాంటిదే. ఈ కేసులో నేరస్తులు యూపీకి చెందిన కూలీలు. ఇటీవల బస్వాపూర్ వద్ద జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో నిందితులు హర్యానాకు చెందిన వారు. మహారాష్ట్రలోని బిలోలి ప్రాంతానికి చెందిన ఓ దొంగను ఇటీవల పట్టణ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. అతడు కామారెడ్డి, చుట్టపక్కల ప్రాంతాల్లో ఏకంగా 35 చోరీలు చేసినట్లు విచారణలో తేలింది. నాందేడ్ ప్రాంతానికి చెందిన ముఠాలు, కర్ణాటకలోని బీదర్ ఇరానీ గ్యాంగ్‌లు సైతం కామారెడ్డి ప్రాంతంలో అనేక దొంగతనాలకు పాల్పడ్డాయి. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే వారిలో ఎక్కువగా రాజస్థాన్‌కు చెందినవారు ఉంటున్నట్లు తెలుస్తోంది.

ఆధారాలు చిక్కకుండా..

తాజాగా జరుగుతున్న చోరీలు, దారి దోపిడీలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. ఆయా కేసుల్లో నిందితులను గుర్తించడం కష్టంగా మారుతోంది. దుండగులు తమను గుర్తు పట్టకుండా, ఎలాంటి ఆధారాలు దొరకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జాకెట్, ముఖానికి ముసుగు, చేతికి గ్లవ్స్ ధరించడం లాంటివి చేస్తూ నేరాలు చేసి జారుకుంటున్నారు. ముసుగులు వేసుకుని కాలనీల్లో దొంగలు సంచరించే సీసీ పుటేజీలు చాలాసార్లు దర్శనమిస్తున్నాయి. గత నవంబర్‌లో సిరిసిల్లా రోడ్‌లో, అడ్లూర్ రోడ్‌లో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులతో పాటు మరికొన్ని చోరీ, దోపిడీ కేసుల్లో నిందితుల గుర్తింపు ఇప్పటికీ జరుగలేదు. బిచ్కుందలో జరిగిన ఏటీఎం చోరీ కేసు కూడా ఇలాంటిదే. ఇటీవల టేక్రియాల్ వద్ద జరిగిన దారి దోపిడీ కేసులో కూడా నిందితులు ముసుగులు ధరించి ఉన్నారని బాధితులు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి



దొంగతనాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఇంటికి తాళం వేసి ఊరెళితే తగిన జాగ్రత్తలు పాటించాలి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు గానీ, డయల్ 100 కు గానీ సమాచారం ఇవ్వాలి.

– రాజేశ్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి



దేశాయిపేట్‌లో దంగల్

హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా దేశాయిపేట్ గ్రామ శివారులో ఆదివారం కుస్తీపోటీలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు పాల్గొన్నారు. కుస్తీ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఈ పోటీలను ఆసక్తిగా తిలకించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– బాన్సువాడ రూరల్

ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష



సమీక్షలో పాల్గొన్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతారావు, భూపతిరెడ్డి

- కాళేశ్వరం 21, 22 ప్యాకేజీలతోపాటు మిగతా ప్రాజెక్టులపైనా చర్చ
- సమీక్షించిన మంత్రులు ఉత్తమ్, జూపల్లి కృష్ణారావు
- పాల్గొన్న ఎంపీ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్, ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టుల పనులపై ఆదివారం హైదరాబాద్‌లోని జలసౌధలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతారావు, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రాణహిత –చేవెళ్ల ప్రాజెక్టులో 22వ ప్యాకేజీ కింద చేపట్టాల్సిన పనులు, భూసేకరణకు నిధులు ఇవ్వాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కోరారు. ఖరీఫ్ సీజన్‌కు నీరందించేందుకోసం వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. నాగమడుగు రబ్బర్‌డ్యాం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. లెండి ప్రాజెక్టుకు సంబంధించి చర్చించారు. అంతర్రాష్ట్ర ఒప్పందాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సింగితం ప్రాజెక్టు వద్ద దెబ్బతిన్న లైనింగ్ పనులను వెంటనే చేపట్టాలని సమావేశంలో అధికారులను ఆదేశించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు సమీపంలో 12ఎకరాలలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయడంపైనా సమావేశంలో చర్చించారు.

కనుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రామారెడ్డి: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి, రాజరాజేశ్వరస్వామి ఆలయాల బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం రథోత్సవం నిర్వహించారు. రథాలగైని నుంచి సబ్ స్టేషన్ వరకు కార్యక్రమం కనుల పండువగా సాగింది. రథోత్సవం అనంతరం సీతారామచంద్రస్వామి, రాజరాజేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రి చక్రతీర్థం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రంగు రవీందర్ గౌడ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాండ్ల సాయిలు, ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం



లింగంపేటలో వడ్ల కుప్పపై నిలిచిన వర్షం నీటిని తోడేస్తున్న రైతులు,



ధాన్యాన్ని ఆరబెడుతూ..

లింగంపేట: శెట్పల్లి, అయ్యపల్లి, పర్మళ్ల, లింగంపేట తదితర గ్రామాల్లో ఆదివారం వడగళ్ల వాన కురిసింది. కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన వడ్లు తడిసిపోయాయి. ధాన్యంలో చేరిన నీళ్లను తోడేయడానికి రైతులు ఇబ్బందిపడ్డారు. ధాన్యం ఆరబెట్టుకోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నదాతలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని, తూకం వేసిన వడ్లను రైస్‌మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.

మూలమలుపులో మృత్యుపిలుపు



తరచూ ప్రమాదాలు జరుగుతున్న మెంగారం సమీపంలోని మూలమలుపు

- లింగంపేట –ఎల్లారెడ్డి మధ్య 14 కిలోమీటర్ల దూరం
- 42 చోట్ల ప్రమాదకర మలుపులు
- సూచిక బోర్డులు కరువు
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

లింగంపేట : కరీంనగర్ – కామారెడ్డి – ఎల్లారెడ్డి(కేకేవై) రహదారిపై ప్రమాదకర మూలమలుపులున్నాయి. ప్రధానంగా ఎల్లారెడ్డి నుంచి లింగంపేట వరకే(14 కిలోమీటర్లు) 42 మలుపులుండడం గమనార్హం. ఇందులో 12 వరకు 'ఎస్' ఆకారంలో ఉండడంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పదుల సంఖ్యలో మృత్యువాతపడ్డారు. వందల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. అయినా అధికారులు మేల్కోవడం లేదు. కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదు. వర్షాకాలంలో పరిస్థితి మరింత భయంకరంగా తయారవుతోంది. మూల మలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరగడంతో ముందు వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మూలమలుపుల కారణంగా వేగంగా వెళ్తున్న బైకులు, ఇతర వాహనాలు మూల మలుపుల్లో అదుపుతప్పి చెట్లను ఢీకొనడం, ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టడం, రోడ్డు కిందికి వెళ్లడం జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి మూల మలుపుల్లో సూచిక బోర్డుల తోపాటు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మూల మలుపుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో జరిగిన ప్రమాదాల వివరాలు..

- లింగంపేట నుంచి ఎల్లారెడ్డి వెళ్లే క్రమంలో లింగంపేట సబ్‌స్టేషన్ వద్దనున్న మూల మలుపులో ఓ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో లింగంపేటకు చెందిన మహిళ మృతి చెందింది.
- లింగంపేట మండల కేంద్రం సమీపంలోని దర్గా వద్ద మూల మలుపులో ఆటో బైకు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు.
- మెంగారం చెరువు వద్ద మూల మలుపులో కారు బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముంబోజీపేటకు చెందిన ఇద్దరు యువకులు చనిపోయారు.
- మెంగారం గ్రామానికి చెందిన కొమ్ముల మల్లేశం బైకు లింగంపేట పెద్దవాగు వద్ద అదుపు తప్పడంతో రోడ్డు కింద పడి మృతి చెందాడు.
- మెంగారం మిద్దె మిట్టు దిగుడుకు మూల మలుపుల్లో బస్సు బైకు ఢీకొన్న ఘటనలో పొల్కంపేటకు చెందిన ఇద్దరు అన్నదమ్ములు అక్కడికక్కడే మృతి చెందారు.
- కొట్టాల్ శివారులోని మూలమలుపులో 2018లో బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో అప్పటి మెగారం సర్పంచ్ తంతిరి ప్రభాకర్ మరణించారు.
- లింగంపేట పెద్దవాగు సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో పలువురికి గాయాలు కాగా ఒకరు మృతి చెందారు.
- లింగంపేట రాధా స్వామి ఆలయం వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో బైక్‌పై వెళ్తున్న భార్య మృతి చెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి.



లింగంపేట సమీపంలోని మూలమలుపు



అడవి లింగాల వద్ద మూలమలుపులో ఉన్న వంతెన



మిద్దెమిట్టు ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

క్లుప్తంగా

ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగం మనదే



వెబినార్‌లో పాల్గొన్న తెయూ వీసీ, రిజిస్ట్రార్, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): బీఆర్ అంబేడ్కర్ భారతదేశాన్ని కేవలం రాజకీయంగా కాకుండా ప్రజాస్వామ్యంగా మార్చాలనే లక్ష్యంతో ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగం రూపొందించారని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు అన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం తెయూ ఎస్సీ సెల్ డైరెక్టర్ వాణి నేతృత్వంలో '21వ శతాబ్దంలో అంబేడ్కర్ ఆలోచనల ఔచిత్యం' అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వర్తమాన సమాజంలో భారతదేశానికి అంబేడ్కర్ ఆలోచనలు అనుసరణీయమన్నారు. తెయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని, అంబేడ్కర్‌ను వేరువేరుగా చూడలేమన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుకుమార్ మాట్లాడుతూ.. ఆధునిక భారతదేశంలో రాజ్యాంగం ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నాగరాజు, కేఆర్‌ఈఏ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాంబయ్య మాట్లాడారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, డీన్‌లు ఘంటాచంద్రశేఖర్, రాంబాబు గోపిశెట్టి, పీఆర్‌వో పున్నయ్య, అధ్యాపకులు నాగరాజు, జెట్లింగ్ ఎల్లోసా, ప్రసన్నరాణి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కలప లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మాగి గ్రామ శివారులో ఆదివారం కలప లారీ బోల్తాపడింది. పిట్లం వైపు నుంచి నిజాంసాగర్ వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

ముళ్ల కంచే స్కూల్‌కు గేటు



గేటు ముందు వేసిన ముళ్ల కంచె

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని గణేశ్ మందిర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గేటు పూర్తిగా విరిగిపోయింది. ఉపాధ్యాయులు గేటుకు ముళ్లకంచె కట్టి దారి మూసివేశారు. ప్రభుత్వం ఈపాఠశాలకు లక్షల నిధులు మంజూరు చేసింది. అదనపు గదులు ఇతర మరమ్మతులు చేయించినా, అధికారులు, ఉపాధ్యాయులు మాత్రం గేటు మరమ్మతులు చేయించలేదు.కొందరు వ్యక్తులు పాఠశాల ఆవరణలో మూత్ర విసర్జన చేస్తున్నారు. దారి మూసివేయడంతో విద్యార్థులు హైస్కూల్ గేటు నుంచి రాకపోకలు చేస్తున్నారు. ఇకనైన అధికారులు స్పందించి కొత్తగా గేటు బిగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

టర్బయిన్ల ఆధునికీకరణ పనుల్లో జాప్యం

- నిజాంసాగర్ ప్రాజెక్టు జలవిద్యుదుత్పత్తి కేంద్రంలో తలెత్తిన సాంకేతిక సమస్యలు
- మూడోటర్బయిన్‌కు యాభై ఏళ్లుగా మరమ్మతులు కరువు
- దెబ్బతిన్న పరికరాలకు నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు



మరమ్మతులకు నోచుకోని టర్బయిన్



హెడ్‌స్లూయిస్ జల విద్యుదుత్పత్తి కేంద్రం

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టు జల విద్యుదుత్పత్తి కేంద్రం టర్బయిన్ల ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. విద్యుదుత్పత్తి చేయడానికి మరింత ఆలస్యం కానుంది . ఈటర్బయిన్ల మరమ్మతుకు 2020 సంవత్సరంలో రూ. 12 కోట్లు మంజూరు అయ్యాయి. నిజాంసాగర్ ప్రాజెక్టుకు అనుసంధానంగా హెడ్‌స్లూయిస్ వద్ద 15 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి సామర్థ్యంతో జల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని 1954 ఏర్పాటు చేశారు. హైడ్రో ఎలక్ట్రిక్ జనరేషన్ కింద మూడు టర్బయిన్లు ఏర్పాటు చేశారు. మూడో టర్బయిన్ 1974లో చెడిపోయి మూలనపడింది. సదరు టర్బయిన్ మూలన పడి 50 ఏళ్లు గడిచినా ఇంత వరకు మరమ్మతుకు నోచుకోవడం లేదు. జలవిద్యుదుత్పత్తి చేపడుతున్న రెండు టర్బయిన్లు సాంకేతిక సమస్యలు ఉత్పన్నం అవుతుండటంతో మరమ్మతులకు అనుమతించారు. రెండో టర్బయిన్ మరమ్మతులు ప్రారంభించారు. సదరు టర్బయిన్‌లో పరికరాలు పూర్తిగా దెబ్బతినడంతో అనుకున్నంతగా పనులు ముందుకు సాగడం లేదు.జలవిద్యుదుత్పత్తి కేంద్రం ఆధునికీకరణతో పాటు టర్బయిన్లకు పూర్తి మరమ్మతు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దాంతో ప్రభుత్వం రూ. 12 కోట్లు మంజూరు చేసినా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. టర్బయిన్ల మరమ్మతులు ఆలస్యం అవుతుండటంతో జలవిద్యుదుత్పత్తి నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి వేసవిలో పనులు త్వరగా పూర్తి చేస్తే వానకాలంలో జలవిద్యుదుత్పత్తి ప్రారంభించవచ్చు.

రూ. కోటి మంజూరుకు ప్రతిపాదనలు



జల విద్యుద్పుత్తి కేంద్రం మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. రెండవ టర్బయిన్ అనుకున్న దానికన్నా ఎక్కువగా మరమ్మతులు చేపట్టాల్సిన పరిస్థితి ఉంది. ప్యానల్ బోర్డు, ఎలక్ట్రికల్ పరికరాలు, వైరింగ్, టర్బయిన్ మరమ్మతులకు నిధులు ఏమాత్రం సరిపోవడం లేదు. రూ.కోటి మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించాం.

– రవికుమార్, ఏడీ, సివిల్ ఆర్‌అండ్‌ఎం

ఉపాధ్యాయ ఉద్యమనేతకు కన్నీటి వీడ్కోలు

- కందుకూరి రమణ అంత్యక్రియలకు తరలివచ్చిన టీచర్లు, ప్రజాసంఘాల నేతలు



రమణకు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నేతలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఉపాధ్యాయ ఉద్యమాలతో పాటు తెలంగాణ ఉద్యమంలో, అనేక సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని క్యాన్సర్‌తో చనిపోయిన టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి రమణ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం కామారెడ్డి పట్టణంలో జరిగాయి. రాష్ట్రం నలుమూలల నుంచి ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాల నేతలు తరలివచ్చారు. ఆయనకు ఘన నివాళులు అర్పించారు. హౌసింగ్ బోర్డులోని ఆయన నివాసం నుంచి పెద్ద చెరువు దిగువన ఉన్న శ్మశాన వాటిక వరకు జరిగిన అంతిమయాత్రలో వందలాది మంది పాల్గొన్నారు. అంత్యక్రియల వద్ద పలువురు ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలను స్మరించుకున్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు టి.హన్మాండ్లు, వై.అశోక్‌కుమార్, కే.వేణుగోపాల్, అనిల్‌కుమార్, తిరుపతి, కొంగల వెంకటి, ప్రకాశ్, లచ్చయ్య, శ్రీధర్, రాంచంద్రం, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, సిరిసిల్ల జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు తోట ఆగయ్య, ప్రముఖ రచయిత్రులు కాత్యాయని, తుర్లపాటి లక్ష్మి, వివిధ సంఘాల ప్రతినిధులు జి.జగన్నాథం, శ్యాంరావ్, క్యాతం సిద్దరాములు, శంకర్ తదితరులున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నారాయణ గోశాలలో గోశాలలో ఆవులు చోరీకి గురికాకుండా ఉండేందుకు ఆదివారం ఎస్సై విజయ్‌కొండ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అనంతరం ఆవులను ఎలా రక్షించుకోవాలో గోశాల కమిటీకి ఎస్సై పలు సూచనలు సలహాలు అందించారు. అనంతరం ఎస్సైని గోశాల కమిటీ అధ్యక్షుడు సంజయ్ సన్మానించారు.

రాజీవ్ యువ వికాసానికి ఆన్‌లైన్ అవస్థలు

- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు
- వరుసగా సెలవులు
- అందని ధ్రువీకరణ పత్రాలు



పనిచేయని రాజీవ్ యువ వికాసం సైట్

బిచ్కుంద(జుక్కల్) : నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ఆశావాహుల్లో ఆందోళన కనిపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలకు మూడు రోజులు సెలవులు రావడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందలేదు. వీటితో పాటు మీసేవాలో దరఖాస్తులు చేసుకుంటున్న యువతకు ఆన్‌లైన్ అవస్థలు, సర్వర్ బిజీతో సైట్ ఓపెన్ కావడం లేదు. అందరు ఒకేసారి దరఖాస్తులు చేసుకోవడం సర్వర్ బిజీతో మీసేవా వద్ద దరఖాస్తుదారులు పడిగాపులు కాస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సమస్యనే ఎదుర్కొంటున్నారు. దరఖాస్తు కోసం సోమవారం ఆఖరు. శని, ఆది సెలవులు రావడంతో తహసీల్ కార్యాలయాలు మూసి ఉన్నాయి. కొందరికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందక దరఖాస్తులు చేసుకోలేకపోతున్నారు. ప్రభుత్వం గడువు పెంచి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తు చేసుకునే విధంగా మరోసారి అవకాశం కల్పించాలని నిరుద్యోగ యువత కోరుతున్నారు.

అధ్వానంగా రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు



తలమడ్ల రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు నుంచి వస్తున్న వాహనదారుడు

రాజంపేట : మండలంలోని తలమడ్ల గ్రామ పరిధిలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదా రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



గాయపడ్డ మహిళ



రోడ్డుపై గుంతలకు అడ్డంగా కర్రలు, రాళ్లు పెట్టిన గ్రామస్తులు

- ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోని అధికారులు

గాంధారి(ఎల్లారెడ్డి): గాంధారి–బాన్సువాడ ప్రధాన రహదారిపై గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సదాశివనగర్ మండలం ధర్మరావుపేట్‌కు చెందిన ఓ వ్యక్తి కుటుంబంతో పోతంగల్‌కు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో తిమ్మాపూర్ స్టేజీ వద్ద గుంతల రోడ్డులో మహిళ బైక్‌పై నుంచి ఎగిరి కిందపడింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మాపూర్ గ్రామస్తులు వెంటనే మహిళను కారులో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సంబంధిత అధికారులు మరమ్మతుల పేరుతో ప్లొకెయిన్‌తో గుంతలను తవ్వి వదిలేశారు. వాహనదారులు గమనించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

గుంతలమయంగా బ్రాహ్మణపల్లి-దేవాయిపల్లి బీటీ రోడ్డు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి దేవాయిపల్లి మీదుగా బ్రాహ్మణపల్లి వరకు ఉన్న బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. రెండేళ్ల క్రితం వేసిన రోడ్డు ధ్వంసమై గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈదారిలో ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

అలా వేశారు.. ఇలా చేశారు



మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో ఇటీవల ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. గాంధీ చౌక్‌లో సీసీ రోడ్డు వేశారు. రోడ్డుపై నుంచి ఎవరుకూడా వెళ్లరాదని అడ్డుగా కంచెను ఏర్పాటు చేశారు. అయినా కొద్దిసేపటికే ప్రజలు అందులోంచి నడవడం, బైక్‌లతో వెళ్లడంతో రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది.

51ఏళ్ల తర్వాత కలిసిన బాల్య మిత్రులు



మాణిక్ భవన్ స్కూల్ 1973-74 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



ఎల్లారెడ్డి జెడ్పీహెచ్‌ఎస్ 1994-95 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

డిచ్‌పల్లి: వారంతా పూర్వ విద్యార్థులు. 51ఏళ్ల క్రితం పదోతరగతి చదివి ఎక్కడెక్కడో స్థిరపడిన వారు. మళ్లీ ఇన్నాళ్లకు కలిశారు. గత మధురస్మృతులను నెమరువేసుకుని పరవశించి పోయారు. జిల్లా కేంద్రంలోని మాణిక్ భవన్ పాఠశాలలో 1973–74 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు డిచ్‌పల్లిలోని ఫాం హౌస్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆటపాటలతో అలరించారు. హైదరాబాద్, విశాఖపట్నంతో పాటు అమెరికాలో స్థిరపడిన ఒకరు సమ్మేళనానికి తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా ఆటపాటలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. డిచ్‌పల్లి సొసైటీ మాజీ చైర్మన్ గజవాడ జైపాల్, నాగరాజు, అశోక్, చిరంజీవి, ఉమాపతి, చంద్రసేన్, సుబ్రహ్మణ్యం, రాజేశ్వర్, జనార్దన్ యాదవ్, వీరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో 22ఏళ్లకు..

కామారెడ్డి రూరల్: కామారెడ్డిలోని వివేకనంద పాఠశాలలో 2002–2003 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. 60 మంది విద్యార్థులకుగాను 45 మంది పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరై, ఆనాటి తీపి గుర్తులను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను సన్మానించారు. అనంతరం ఆటపాటలు, విందుభోజనంతో ఆహ్లాదంగా గడిపారు. నగేష్‌గుప్తా, మహేశ్వరీ, బబిత, జ్యోతి, దొడ్లె సంజీవ్‌కుమార్, సుధాకర్, భాస్కర్, రణధీర్ తదితరులు ఉన్నారు.





వివేకానంద పాఠశాల 2002-03 ఎస్సెస్సీ బ్యాచ్.. పెద్దవాల్గోట్ జెడ్పీహెచ్‌ఎస్ 2003-04 ఎస్సెస్సీ బ్యాచ్

ఎల్లారెడ్డిలో ముప్పై ఏళ్లకు..

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1994–95 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి 30 ఏళ్ల తరువాత విద్యార్థులంతా కలుసుకున్నారు. అనంతరం వారికి పాఠాలను బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పద్మ శ్రీకాంత్, వెంకట్‌రాములు, వెంకటేశం, దత్తు, విజయ్, నర్సింలు తదితరులున్నారు.

పెద్దవాల్గోట్‌లో 21ఏళ్లకు..

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003–04 ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని సరదాగా గడిపారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

పద్మాజీవాడిలో 25ఏళ్లకు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడిలో ఆదివారం మాతృశ్రీ జూనియర్ కళాశాలకు చెందిన 1998–2000 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఒక్కచోట చేరారు. పద్మాజీవాడి శివారులో ఓ వ్యవసాయ క్షేత్రంలో కలుసుకుని గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. గురువులు రాజ గంబీర్‌రావు, గోపాల్‌రెడ్డి, లింగారెడ్డి, కృష్ణ, కృష్ణ ప్రసాద్, పూర్వ విద్యార్థులు శ్రీధర్ రెడ్డి, కృష్ణరెడ్డి, సంతోష్, రాజేందర్, శ్రీకాంత్, మోహన్, గంగాధర్, సురేందర్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



1998-2000 ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శీను (ఫైల్)

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నందిపేటకు చెందిన పురుషోత్తపట్నం శ్రీను (48) గురుకుల పాఠశాలలకు చికెన్ సప్లయ్ చేస్తుండేవాడు. కమ్మర్‌పల్లి గురుకుల పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం చికెన్ డెలివరీ చేసేందుకు అతడు కారులో బయలుదేరాడు. కమ్మర్‌పల్లి మండలం ఉప్పులూరు ఏకలవ్యనగర్ వద్ద అతడి కారుకు ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు నడుపుతున్న శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న అతడి కూతురు, ఆమె స్నేహితురాలికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు వీరిని ఆస్పత్రికి తరలిస్తుండగా శ్రీను మృతిచెందాడు.

కల్వర్టు గుంతలో పడి ఇద్దరికి గాయాలు





ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. అన్నాసాగర్ గ్రామానికి చెందిన బాలరాజు, తన కూతురు భావనతో కలిసి ఆదివారం బైక్‌పై ఎల్లారెడ్డికి బయలుదేరారు. తిమ్మారెడ్డి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు కల్వర్టు గుంతలో వారు పడిపోయారు. ఈ ఘటనలో తండ్రి, కూతురికి గాయాలు కావడంతో స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాలరాజుకు తీవ్రగాయాలు కావడంతో కామారెడ్డికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. రోడ్డు పనులు జరుగుతున్న సమయంలో ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పా టు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నా యని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి..



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని సంగం గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో నలుగురు గాయపడ్డారు. వెంటనే బాధితులను స్థానికులు 108లో బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. పిచ్చికుక్కను స్థానికులు కొట్టి చంపేశారు.

నందిపేటలో ధాన్యం బస్తాల చోరీ



లారీ నుంచి ఆటోలోకి డంప్ చేస్తున్న ధాన్యం బస్తాలు

నందిపేట్(ఆర్మూర్): వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం నుంచి రైస్‌మిల్‌కు లారీ తరలిస్తుండగా మార్గ మధ్యలో డ్రైవర్ చోరీ చేసిన ఘటన నందిపేట మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నందిపేట మండలం చింరాజ్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఆదివారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామంలోని రాజరాజేశ్వర రైస్‌మిల్‌కు తరలించారు. మార్గ మధ్యలో నందిపేట వద్ద డ్రైవర్ లారీని నిలిపి, కొన్ని ధాన్యం బస్తాలను ఆటోలో ఎక్కించాడు. ఈ తతంగాన్ని స్థానికులు అనుమానంతో వీడియో తీసి, సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో వైరల్ అయింది. వీడియోను చూసిన రైతులు సొసైటీకి వెళ్లి అధికారులను అడగడంతో తాము కూడ లారీ ఇంకా రైస్‌మిల్‌కు చేరలేదని ఆందోళన చెందుతున్నామన్నారు. అనంతరం అధికారులు రైతులతో కలిసి ఘటన స్థలానికి వెళ్లి లారీ డ్రైవర్‌ను నిలదీయగా, చోరీని ఒప్పుకున్నాడు. గత మూడు రోజుల నుంచి ఇలాగే లారీలో బస్తాలు తక్కువగా రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మల్లారం తండాలో ఒకరి ఆత్మహత్య



విక్రమ్ (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మల్లారం తండాలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా.. తండాకు చెందిన కెతావత్ విక్రమ్(26) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈక్రమంలో శనివారం రాత్రి తన పొలంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బడిలో చోరీకి యత్నించిన దుండగులు



కామారెడ్డి రూరల్: పాఠశాలలో చొరబడిన ముగ్గురు దొంగలు చోరీకి యత్నించగా గ్రామస్తులు వారిని వెంబడించి, ఒకరిని పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా.. టేక్రియాల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం పాఠశాల వెనకాల ఉన్న ప్రహరీ నుంచి గుర్తుతెలియని ముగ్గురు దుండగులు బడిలోకి ప్రవేశించారు. వరండాలోని ఓ సెల్ఫ్ పైన ఉన్న ఫ్యాన్లు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులను సంచిలో వేసుకొని ఎత్తుకెళ్తుండగా స్థానికులు గమనించి వెంబడించారు. ఇద్దరు దుండగులు ప్రహరీ దూకి పారిపోగా, ఒకరిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌రూం తాళాన్ని కూడా పగలగొట్టడానికి దొంగలు యత్నించినట్లు తెలిపారు.